# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- రాష్ట్ర, కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తా
- ఈ కేంద్ర మంత్రి పదవి ప్రజలు పెట్టిన భిక్షే
- హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- మంత్రి హోదాలో మొదటిసారి కరీంనగర్‌కు రాక



కరీంనగర్: పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్ విద్యానగర్, జూన్ 19: రాజకీయాలకు అతీతంగా కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధితో పాటు తెలంగాణ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత అభివృద్ధే తన లక్ష్యమని చెప్పారు. తనకీ మంత్రి పదవి కరీంనగర్ ప్రజలు, కార్యకర్తలు పెట్టిన భిక్షేనని ఉద్వేగానికి లోనయ్యారు. రాబోయే రోజుల్లో అంజన్న, రాజన్న ఆలయాలను అభివృద్ధి చేస్తామని అన్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారి బుధవారం కరీంనగర్ వచ్చిన ఆయనకు, శనిగరం నుంచి దారిపొడవునా అభిమానులు, నాయకులు స్వాగతం పలికారు. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఘనంగా స్వాగతించారు. అక్కడి నుంచి ఓపెన్ టాప్ వాహనంపై సంజయ్ అభివాదం చేస్తూ కమాన్ వద్దకు వచ్చారు. తనను గెలిపించిన కరీంనగర్ ప్రజలు, తనకు గుర్తింపునిచ్చిన తెలంగాణ ప్రజలకు 'సెల్యూట్ కరీంనగర్.. సెల్యూట్ తెలంగాణ' అంటూ సాష్టంగా నమస్కారం చేశారు. తెలంగాణ చౌక్‌కు రాగానే పలువురు ముస్లిం నాయకులు పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్అండ్‌బీ గెస్ట్ వద్ద సంజయ్‌కు కలెక్టర్, అదనపు కలెక్టర్ పూల బొకేలు అందించారు. పోలీసులు గౌరవ వందనం చేశారు. అక్కడి నుంచి చైతన్యపురిలోని మహాశక్తి అమ్మవారి ఆలయానికి చేరుకొని, కుటుంబసభ్యులతో కలిసి పూజలు చేశారు. ఆ తర్వాత కొండగట్టు అంజన్నను దర్శించుకున్నారు. ఎంపీ ఎన్నికల సమయంలో కట్టిన ముడుపు విప్పి మొ క్కులు చెల్లించుకున్నారు. ఆ తర్వాత కొడిమ్యాల మండలం నల్లగొండ లక్ష్మీనరసింహ స్వామి, వేములవాడలో రాజరాజేశ్వర స్వామి, సిరిసిల్లలో మార్కండేయ స్వామి ఆలయాల్లో పూజలు చేశారు. ఆయా చోట్ల బండి సంజయ్ మాట్లాడారు. అధికారాన్ని డబ్బు కోసమో, పదవీ దర్పం కోసమో వినియోగించబోనని, ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. కార్పొరేటర్ నుంచి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఎదిగానంటే కేవలం బీజేపీ వల్లే సాధ్యమైందని, అమ్మవారి ఆశీస్సులతోనే ఎదిగానని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాసంగ్రామ యాత్ర పేరిట 155 రోజులు పాదయాత్ర చేస్తే.. తన అడుగులో అడుగు వేసి కార్యకర్తలు నడిచినందునే ఈ పదవి వచ్చిందన్నారు. అందుకే ఈ పదవి కార్యకర్తలకే అంకితం చేస్తున్నానని చెప్పారు.



కరీంనగర్: మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

# జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎవరు?

అధికారం లేని మంత్రి ప్రభాకర్ బల్దియాపై సమీక్షించడం విడ్డూరం

- ఉత్తమ్ కుమార్ రెడ్డిని మార్చారా..?
- అధికారం లేని మంత్రి ప్రభాకర్ బల్దియాపై సమీక్షించడం విడ్డూరం
- కనీస సమాచారం కూడా ఇవ్వరా..?
- ఆరోపణలపై విచారణకు మేం రెడీ.. మీరు సిద్ధమేనా..?
- మంత్రి పొన్నంపై మేయర్ సునీల్‌రావు ఫైర్
- దమ్ముంటే బడ్జెట్‌లో బల్దియాకు ₹200 కోట్లు నిధులు కేటాయించాలని సవాల్

కార్పొరేషన్, జూన్ 19: 'కరీంనగర్ జిల్లాకు ఎలాంటి సంబంధం లేని వ్యక్తి, నగరపాలక సంస్థకు సంబంధించి ఎలాంటి అధికారం లేని మంత్రి పొన్నం ప్రభాకర్ కార్పొరేషన్‌పై సమీక్షించడం విడ్డూరం. అసలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎవరు? ఉత్తమ్‌కుమార్ రెడ్డిని ఏమైనా మార్చారా..?' అంటూ మేయర్ సునీల్‌రావు ఫైర్ అయ్యారు. కుటుంబంతో సహా తన ఓటు హక్కును సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు మార్చుకొని బదిలీ అయిన మంత్రి పొన్నం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కాదని ఏ అధికారంతో మున్సిపల్‌పై సమీక్ష చేశారని ప్రశ్నించారు. కనీసం నగరపాలక సంస్థకు చెందిన 60 మంది సభ్యులకు గానీ, కో ఆప్షన్ సభ్యులకు గానీ, ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్న స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ, నగర మేయర్‌కు సమాచారం ఇవ్వకుండా మున్సిపల్ అధికారులతో సమీక్ష ఎలా నిర్వహిస్తారని జిల్లా యంత్రాంగాన్ని ప్రశ్నించారు. అధికార ప్రోగ్రాంను పార్టీ కార్యక్రమంలా భావించి సమావేశం నిర్వహించడం సిగ్గుచేటన్నారు. పొన్నంకు దమ్ముంటే వచ్చే బడ్జెట్‌లో నగరపాలక సంస్థ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ₹200 కోట్ల నిధులు కేటాయించే విధంగా చూడాలన్నారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడారు. కరీంనగర్ ప్రజలు మూడు సార్లు డిపాజిట్ రాకుండా ఓడగొట్టారన్న కోపంతో పొన్నం ప్రభాకర్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. నగరంలో అన్ని వర్గాల ప్రజలను ఇబ్బంది పెట్టాలన్న కోపంతో రగిలిపోతున్నారని దుయ్యబట్టారు. 2009 నుంచి 2014 వరకు ఎంపీగా నగరాభివృద్ధి కోసం ఒక్కరోజు కూడా ఆలోచన చేయలేని వ్యక్తి, ఇప్పుడు నగరంలో సాగుతున్న అభివృద్ధిపై బురద జల్లుతున్నారని దుయ్యబట్టారు. గడిచిన పదేళ్లలో జరిగిన ప్రగతి 'మీ కండ్లకు కనబడడం లేదా?' అని నిలదీశారు. ఆదరించిన హుస్నాబాద్ ప్రజల కోసం, ఆ ప్రాంత అభివృద్ధి కోసం ఆలోచనలు చేస్తే బాగుంటుందని హితవుపలికారు. తమ పాలకవర్గంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనేక విధాలైన అవార్డులు వచ్చాయని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం సఫాయి మిత్ర సురక్షా ఛాలెంజ్‌లో ₹4 కోట్ల నగదు బహుమతి సాధించిన ఘనత తమదేనని, రాష్ట్రంలో మరే మున్సిపాలిటీకీ ఈ పురస్కారం రాలేదని గుర్తుచేశారు. నగర అభివృద్ధిపై ఆరోపణలు చేసిన మంత్రి, ఆయన ఇంటి చుట్టు పక్కల ప్రాంతాలను చూస్తే ఎంత మార్పు చెందిందో కనిపిస్తుందన్నారు. ఎంపీగా పని చేసిన కాలంలో ప్రజల తాగునీటి కోసం ఒక్క రోజు కూడా ఆలోచన చేయలేదని దుయ్యబట్టారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మానేరు డ్యాంలో నీరు లేకుండా చేసి ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తెచ్చారని, ఫలితంగా రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయాల్సిన దుస్థితి వచ్చిందని విమర్శించారు. తమ ప్రభుత్వంలో ₹133 కోట్లతో పనులు చేపట్టి నాలుగున్నరేండ్లపాటు ప్రతి రోజూ మంచినీటి సరఫరా చేశామని గుర్తు చేశారు. ఇంకా పారిశుధ్య విభాగంలో వాహనాలు, యంత్రాల వినియోగంతో కార్మికుల భారాన్ని తగ్గించేందుకు సమూల మార్పులు తీసుకువచ్చామన్నారు. కాంగ్రెస్ పాలనలో ఉజ్వల పార్కు తప్ప మరొకటి లేదని, కానీ తమ పాలనలో నగరంలోని 24 పార్కులు, 35 వాకింగ్ ట్రాక్స్, ఓపెన్ జిమ్స్ ఏర్పాటు చేసిన ఘనత తమకే దక్కుతుందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ, గందె మాధవి, ఐలేందర్, శ్రీకాంత్, వాల రమణారావు, ఎడ్ల సరిత, నాంపల్లి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

## అవగాహన లేకుండా విమర్శలా..?

సీఎం అస్యూరెన్స్, స్మార్ట్‌సిటీపై పొన్నంకు కనీస అవగాహన లేదు. అప్పటి మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ చొరవతో ₹347 కోట్ల నిధులు వచ్చాయి. ఏం తెలియకుండానే అభివృద్ధిపై ఆరోపణలు చేయడం దురదృష్టకరం. మంత్రి హోదాలో ఉండి అధికారులను బెదిరించే మనస్తత్వం మానుకోవాలి. పొన్నం ఆరు నెలల పాలనలోనే అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. దానికి ఆయన ఏం సమాధానం చెబుతారు? అభివృద్ధి పనులపై విజిలెన్స్ విచారణ జరపాలంటున్న మంత్రి, మరి ఆయనపై వచ్చిన ఆరోపణలపై కూడా విచారణకు సిద్ధమేనా..? గతంలో ఎంపీగా బండి సంజయ్ అభివృద్ధి విషయంలో సహకారం అందించారు. కేంద్ర సహాయ మంత్రి హోదాలో కూడా అదే తీరు నగరాభివృద్ధికి మరిన్ని నిధులు తేవాలి.

- మేయర్ సునీల్‌రావు

## కరెంట్ ఇచ్చుడే పాపమైందా..?



పదేండ్ల కింద కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోసం అరిగోసపడ్డం. ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో తెలిసేది కాదు. తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ ఖర్చయినా సరే విద్యుత్ కొని కోతలు లేకుండా చేసిండు. నాన్న రెండెకరాలల్ల రంది లేకుంట వ్యవసాయం చేసుకున్న. పంటలు మంచిగా పండినయి. పదేండ్ల నుంచి ఏ బాధా లేకుంట ఉన్నం. ఇప్పుడు కాంగ్రెస్ వచ్చి మళ్లీ పాత రోజులు తీసుకువస్తుంది. ఆరు నెలల పాలనలోనే చుక్కలు చూపిస్తుంది. మొన్న యాసంగిల కరెంట్ సక్కగ లేక చాలా మంది పొలాలు ఎండినయ్. పదేండ్లపాటు రెప్పపాటు కోతలు లేకుండా చేసిన కేసీఆర్ ప్రభుత్వాన్ని కరెంట్ కొనుగోళ్లమీద నిలదీసుడు కరెక్ట్ కాదు. ఆయనతోనే మా రైతులు బాగుపడ్డరు.

- అమరగొండ స్వామి, చామనపల్లి (కరీంనగర్‌రూరల్)

# చేతగాక నిందలా..?

## కరెంటిచ్చిన కేసీఆర్‌ను బద్నాం చేయడం సరికాదు : రైతులోకం

### వెలుగుల నుంచి చీకట్లలోకి!

- ఉమ్మడి రాష్ట్రంలో అల్లాడిన రైతులు
- నాలుగైదు గంటలతో పడిగాపులు
- అది రాత్రి వేళ సరఫరాతో ప్రమాదాలు
- స్వరాష్ట్రంలో నిరంతరాయంగా సరఫరా
- కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ ఇక్కట్లు
- తప్పించుకునేందుకు గోస తీర్చిన కేసీఆర్‌పైనే అభాండాలు
- మండిపడుతున్న ఉమ్మడి జిల్లా రైతులు
- తీరు మార్చుకోవాలని హితవు



**కరెంట్ ఎప్పడొస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితులు.. చిన్న అంతరాయం కలిగినా కోతలు.. లో ఓల్టేజీతో కాలిపోయే మోటర్లు.. లోడ్ పడి చెడిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు.. బావుల్లో నీరున్నా అందక ఎండే పంటలు.. రాత్రీ పగలు తేడా లేకుండా బావుల వద్దనే పడిగాపులు.. అర్ధరాత్రి సరఫరాతో ప్రాణాలకు గ్యారెంటీ లేని రోజులు.. ఇప్పుడు మళ్లీ గుర్తొస్తున్నాయా..? అని రైతులోకాన్ని అడిగితే.. అవునని సమాధానం ఇవ్వడమే కాదు, కాంగ్రెస్ సర్కారుపై భగ్గుమంటున్నది. తెలంగాణ వచ్చిన తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెచ్చిన సంస్కరణలతో రాష్ట్రం వెలుగులమయం అయితే.. మళ్లీ చీకట్లలోకి నెడుతున్నదని మండిపడుతున్నది. పైగా నిరంతర కరెంట్‌తో ఉమ్మడి రాష్ట్రంలోని విద్యుత్ కష్టాలను దూరం చేసి, ఎవుసాన్ని పండుగలా మార్చిన కేసీఆర్‌పై అభాండాలు వేయడంపై ఆగ్రహిస్తున్నది. రైతులు, ప్రజలపై ప్రేమ ఉంటే అంతకంటే ఎక్కువగా పని చేసి చిత్తశుద్ధి చాటుకోవాలని సూచిస్తున్నది. కానీ, నిందలు వేయడం సరికాదని హితవుపలుకుతున్నది.**

కరీంనగర్, జూన్ 19 (నమస్తే తెలంగాణ)/ మంథని: ఉమ్మడి రాష్ట్రంలో కరెంట్ కష్టాలు మామూలువి కావు. నాలుగైదు గంటల కరెంట్ కోసం ముప్పుతిప్పలు పడేది. 2004కు ముందు టీడీపీ అధికారంలో ఉన్నపుడు వచ్చీరాని కరెంట్‌తో నరకం కనిపించేది. పైగా బిల్లులు చెల్లించకుంటే స్టార్టర్లు, మీటర్లు తీసుకెళ్లిన సందర్భాలు కోకొల్లాలుగా ఉండేవి. 2004 తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రోజుకు ఏడు గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పినా.. పూర్తి స్థాయిలో అమలు కాలేదు. పగలు మూడు గంటలు, రాత్రి నాలుగు గంటల చొప్పున సరఫరా చేస్తామని చెప్పినా.. అప్పటి ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదు. ఫలితంగా బావుల్లో నీరున్నా కరెంట్ లేక పంటలకు నీరందించలేని పరిస్థితి ఉండేది. ఎప్పుడొస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని కరెంట్ కోసం రాత్రి, పగలు తేడా లేకుండా బావుల వద్దనే పడిగాపులు గాసేది. డిమాండ్‌కు సరిపడా విద్యుత్ లేక గ్రిడ్‌లో సమస్యలు ఉత్పన్నమై జిల్లాలకు జిల్లాలే చీకట్లో కొట్టు మిట్టాడేవి. పైగా రాత్రి వేళ సరఫరాతో అనేక మంది రైతులు షాక్‌లకు గురై, పాము కాట్లకు బలైనా పట్టించుకునే దిక్కుండేది కాదు. కరెంట్ కోసం ధర్నాలు చేసినా, తెగించి విద్యుత్ ఉప కేంద్రాలపై దాడులు చేసినా అప్పటి ప్రభుత్వం కాసింతైన కనికరించకపోగా.. రైతులపై కేసులు పెట్టి జైల్లో పెట్టించిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. తెలంగాణ ఉద్యమంలో కరెంట్ సమస్య కూడా కీలకంగా మారింది. రైతులు స్వచ్ఛందంగా వచ్చి ఉద్యమాల్లో పాల్గొనేలా చేసింది.

### స్వరాష్ట్రంలో అసాధ్యం సుసాధ్యం

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాక ముందు ఆంధ్రా పాలకులు అనేక శాపనార్థాలు పెట్టారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే రాష్ట్రం పూర్తిగా చీకటిమయం అవుతుందని, కరెంట్ లేకుండా పోతుందని బహిరంగానే మాట్లాడారు. కానీ, తెలంగాణ వచ్చిన తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. కరెంట్ కోసం రైతులు పడుతున్న ఇక్కట్లను ఉద్యమ సమయంలో చూసిన అనుభవంతో మొదటి సంస్కరణలు ఈ రంగంలోనే తెచ్చారు. అప్పటి వరకు రాత్రి, పగలు రెండు పూటల్లో ఇచ్చిన ఏడు గంటల కరెంట్‌ను నిరంతరాయం చేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అంటే 2014 డిసెంబర్ నుంచి మరో రెండు గంటలు పెంచి తొమ్మిది గంటల కరెంట్‌ను పొద్దంతా నిరంతరాయంగా ఇచ్చారు. క్రమంగా విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేస్తూ 2018 జనవరి 1 నుంచి వ్యవసాయానికి నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేశారు. అందుకోసం 2016–18 మధ్య కాలంలో కొత్త విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, లైన్ల బలోపేతం కోసం ఒక్క ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ₹200 కోట్లు ఖర్చు చేశారు. ఆంధ్రా పాలకుల చెంప చెల్లుమనేలా రాష్ట్రాన్ని వెలుగుల మయం చేశారు. ఫలితంగా అన్ని రంగాల మాదిరిగానే వ్యవసాయంలో కూడా అనేక మార్పులు వచ్చాయి. రైతుల కష్టాలను దూరం చేశాయి. అవసరం ఉన్నపుడు విద్యుత్‌ను వినియోగించుకోవడం మొదలు కాగా, లో ఓల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, మోటార్లు కాలిపోవడం వంటి సమస్యలు పూర్తిగా మాయమైపోయాయి. పుష్కలంగా నీళ్లు, నిరంతరాయంగా కరెంట్ సరఫరాతో బంగారం లాంటి పంటలు పండాయి.

### మళ్లీ ఇక్కట్లు మొదలు

దాదాపు పదేళ్లపాటు కరెంట్ కష్టాలు దూరం కాగా.. మళ్లీ తిప్పలు మొదలయ్యాయి. కోతలు, లో ఓల్టేజీ సమస్యలు ప్రారంభమయ్యాయి. పోయిన యాసంగిలో దయనీయ పరిస్థితులు కనిపించాయి. బావుల్లో నీరున్నా పారించేందుకు విద్యుత్ లేక పంటలు ఎండిపోయాయి. ఇప్పుడు వానకాలం సీజన్ మొదట్లోనే అక్కడక్కడా నారుమడులు కూడా అలానే ఎండిపోతున్నాయి. మారుమూల గ్రామాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉన్నట్టు తెలుస్తుండగా.. మూడు రోజుల క్రితం కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ శివారులో గాలివానకు విద్యుత్ స్తంభం ఒరిగి కేబుల్ వైర్ మీద పడడంతో సరఫరా నిలిచిపోయింది. దీంతో నీరందక నారుమడి ఎండిపోతుండగా.. కౌలు రైతు మంద అశోక్ ₹2 వేలు వెచ్చించి వాటర్ ట్యాంకర్ తెప్పించి కాపాడుకున్నాడు. అంతకు ముందు మానకొండూర్ మండలంలోనూ ఇలాంటి దుస్థితే కనిపించింది. దాదాపు అంతటా ఈ సమస్య ఉన్నట్టు తెలుస్తున్నది.

### బద్నాం చేయడం కరెక్ట్‌కాదు



తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సార్ ఏం చేసిండో.. ఎట్ల తెచ్చిండో తెల్వది కని, పదేండ్లళ్ల బాయిలకాడ ఇబ్బందుల్లేకుండా చేసిండు. ఇప్పుడు వచ్చిరానట్టు కరెంటు వస్తంది. రోజుకొకల మోటర్ కాల్తంది. కరెంటు ఉన్నా నా మోటర్ ఇయ్యాల పోయలేదు. కరెంటుల దమ్ములేదు. గిన్ని ఇబ్బందులు ఎప్పుడూ పల్లేదు. నేను వ్యవసాయం చేయవట్టి పదేండ్లైతంది. కరెంటు ఇబ్బందులు ఇప్పుడే తెల్తున్నయ్. ఇప్పుడు నార్లు పోసుకుని, దుక్కులు దున్నే టైంలనే గిట్ల ఉంటే, నాట్లు పడ్డంక పరిస్థితేందో అర్థమైతలేదు. మునుపు ఎప్పుడంటే అప్పుడు బాయికాడికిపోయి ఆన్ చేస్తే మల్ల మొత్తం పారినంక బంజేసేది. ఇప్పుడా పరిస్థితి కనిపిస్తలేదు. పదేండ్లపాటు కోతల బాధలు లేకుంట చేసిన కేసీఆర్‌ను కరెంట్ కొనుగోళ్లమీద బద్నాం చేసుడు కరెక్ట్ కాదు.

- వేల్పుల దేవేందర్, రైతు, రంగపేట, మానకొండూర్(తిమ్మాపూర్)

### చేతనైతే నిరంతరం ఇవ్వాలి



2014కు ముందు విద్యుత్ ఎప్పుడు వస్తుందో..? ఎంత సేపు ఉంటుందో..? ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉండేది. రాష్ట్రం ఏర్పడ్డాక తొలి తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టి విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో గృహ, వ్యవసాయ, పరిశ్రమల రంగానికి సంబంధించి కోతలు లేకుండా నిరంతరం సరఫరా చేసిండు. తెలంగాణ వస్తే కరెంట్ సమస్య వస్తుందన్న వారి నోళ్లు మూతపడేలా చేసిండు. అలాంటి కేసీఆర్‌ను ప్రస్తుతం అధికారంలో ఉన్న పాలకులు విద్యుత్ ఒప్పందాలపై నిలదీసుడు కాదు, చేతనైతే 24గంటల కరెంట్ ఇచ్చి చూపించాలి. ఇదే నా అభిప్రాయం. కేసీఆర్ విద్యుత్ సమస్యల పరిష్కారానికి వేసిన బాటను స్ఫూర్తిగా తీసుకొని ప్రస్తుత పాలకులు వర్తమానం, భవిష్యత్ కాలంలో గృహ, పరిశ్రమలు, వ్యవసాయ రంగాలకు కోతలు లేకుండా చూడాల్సిన అవసరం, బాధ్యత ఎంతైనా ఉంది.

- పలిగిరి చందర్, విద్యుత్ మోటర్ల మెకానిక్ (కమాన్‌పూర్)

### కేసీఆర్‌ను బద్నాం చేసే కుట్ర



తెలంగాణ రాకముందు కరెంట్ కోతలు చెప్పరాదు. ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో తెలిసేది కాదు. రాష్ట్రం వచ్చినా విద్యుత్ సమస్యలు అలాగే ఉంటయని చాలా మంది అన్నరు. కానీ తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ తీసుకున్నరు. 24 గంటల కరెంట్ ఇచ్చి ఇటు వ్యవసాయ రంగాన్ని, అటు పరిశ్రమలను అభివృద్ధిలో నడిపించారు. గృహావసరాలకు కోతలు లేకుండా చేశారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో 24 గంటలు కరెంట్ ఇస్తామని చెప్పి మోసం చేసింది. మొన్న ఎండాకాలంలో సాగుకు సరిగ్గా కరెంట్ ఇయ్యక పంటలు ఎండబెట్టింది. ఆనాడు ప్రజలకు ఇబ్బందులు రావద్దనే కేసీఆర్ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం చేసుకుంది. అప్పుడున్న పరిస్థితుల ప్రకారమే విద్యుత్ రేట్లను చెల్లించారు తప్పా ఇందులో ఎలాంటి కుంభకోణం లేదు. కేవలం ప్రజలకు మంచి చేసిన కేసీఆర్‌ను బద్నాం చేసే ప్రయత్నం మాత్రమే ఇది.

- ఎగోలపు కమల, గృహిణీ (మంథని)

### పదేండ్లళ్ల కోతలే లేవు..



మాది ముత్తారం మండలం మైదంబండ. ఊళ్లే నాకు ఐదెకరాల భూమి ఉంది. పదేండ్ల కింద కాంగ్రెస్ హయాంలో రాత్రి మూడు గంటలు.. పగలు నాలుగు గంటలు కరెంటు వచ్చేది. తరచూ ట్రిప్ అయ్యేది. పంటలు ఎండి పోతున్నయని కరెంట్ ఇవ్వాలని వేడుకున్నా ఇచ్చేటోళ్లు కాదు. కరెంట్ కోసం రాత్రిపూట మోటార్ల దగ్గర జాగారం చేసేటోళ్లం. ప్రత్యేక తెలంగాణలో కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక మా సమస్యలు మొత్తం దూరమైనయ్. 24 గంటల పాటు కరెంట్ ఇవ్వడంతో రాత్రిపూట పొలాలకు పోయే బాధ తప్పింది. పంటలు బాగా పండి మా బతుకులు మారినయి. పదేండ్లపాటు కోతలు లేకుండా వెలుగులు నింపిన కేసీఆర్‌ను ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ ఒప్పందాలపై నిలదీయడం కరెక్టు కాదు. కేసీఆర్ నిర్ణయాలను ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆచరణలో పెట్టి, కోతలు లేకుండా చూడాలి.

-బియ్యాని రాజు, మైదంబండ (ముత్తారం)

### నిందలు సరికాదు : రైతులు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అయితే చీకటి మయమవుతుందని చెప్పిన ఆంధ్రా నాయకులు, విద్యుత్ రంగంలో కేసీఆర్ తెచ్చిన సంస్కరణలు చూసి అబ్బురపడుతున్నరు. అయితే ఇది ఓర్వలేక ఇప్పుడు నిందలు వేయడం సరైనది కాదని రైతులు అభిప్రాయపడుతున్నరు. విద్యుత్ కొనుగోళ్లపై కాంగ్రెస్ సర్కారు కమిషన్ వేయడం, విచారణ జరగకముందే నిందలు వేస్తూ విష ప్రచారం చేయడాన్ని ఉమ్మడి జిల్లా రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నరు. అనేక వర్గాల్లో వెలుగులు నింపిన నాయకుడిపై అభాండాలు మోపడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నరు. ఒకప్పుడు కరెంట్ లేక అల్లాడిన తమకునిరంతరం ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కేసీఆర్ సార్‌కే దక్కుతుందని స్పష్టం చేస్తున్నరు. ఉమ్మడి రాష్ట్రంలో కష్టాలను దూరం చేసుకొని రంది లేకుండా ఎవుసం చేసుకుంటున్నామని, మళ్లీ చీకట్లలోకి నెట్టొద్దని వేడుకుంటున్నారు.



# ఫేక్ వీఎల్‌టీపై మున్సిపల్ ఆర్డీ విచారణ



ఇన్‌చార్జి కమిషనర్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న విచారణాధికారి

జగిత్యాల అర్బన్, జూన్ 19: ఫేక్ వీఎల్‌టీపై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వరంగల్ రీజనల్ డైరెక్టర్ షాహీద్ మసూద్ జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో బుధవారం విచారణ చేపట్టారు. జగిత్యాల 'మున్సిపాలిటీలో భారీ భూబాగోతం' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ఫేక్ వీఎల్‌టీ మంజూరు చేసిన జగిత్యాల మున్సిపల్ ఆర్వో ప్రసాద్, కమిషనర్ అనిల్‌బాబుతోపాటు కబ్జా చేసిన మరో ముగ్గురిపై జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విచారణ చేసిన పోలీసులు జగిత్యాల మున్సిపల్ ఆర్వో ప్రసాద్, మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. కమిషనర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. కాగా, బుధవారం రీజనల్ డైరెక్టర్ మసూద్ వీఎల్‌టీ నంబర్‌కు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. కార్యాలయంలోని రెవెన్యూ విభాగం సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. చర్యల కోసం నివేదికను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ డైరెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు. ఆయన వెంట జగిత్యాల ఇన్‌చార్జి కమిషనర్ యాదగిరి ఉన్నారు.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571